ఫోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ మాడల్

న్యూఢిల్లీ, మే 27: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్...దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. నూతన గోల్ఫ్ జీటీఐ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ధరను రూ.53 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఫోక్స్‌వ్యాగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ తెలిపారు. 12.9 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, 10.2 ఇంచుల డిజిటల్ కాక్‌పిట్, అన్ని కాలలను కంట్రోల్ చేసుకునే విధంగా టెక్నాలజీ, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్-2 అడాస్‌తో పాటు మరిన్ని ఫీచర్స్‌తో ఈ కారును తీర్చిదిద్దింది. కేవలం 5.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

ఐటీ రిటర్న్‌ల గడువు పెంపు

సెప్టెంబర్ 15 వరకు పెంచిన సీబీడీటీ

న్యూఢిల్లీ, మే 27: ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ శుభవార్తను అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ చెల్లింపులు గడువును సెప్టెంబర్ 15 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో అసెస్‌మెంట్ ఏడాది (ఏవై) 2025-26కిగాను జూలై 31 వరకు ఉన్న గడువును మరో నెలన్నర పెంచినట్టు అయింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐటీఆర్‌లో మార్పులు చోటు చేసుకోవడం, యుటిలిటీ వ్యవస్థ అమలుకు అవసరమైన సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న సీబీడీటీ ఐటీ గడువు పొడిగించింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఐటీ రిటర్నులు దాఖలు చేయడానికి ఐటీ శాఖ నిరంతరంగా కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగానే ఐటీ ఫామ్‌లో పలు మార్పులు చేసింది. ఈ నోటిఫై చేసిన ఐటీ ఫామ్‌తో చెల్లింపుదారులు సులభతరంగా, పారదర్శకతను పెంచడం, ఖచ్చితమైన సమాచారం అందించాలనే ఉద్దేశంతో సీబీడీటీ పలు మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం కావడమే ఇందుకు కారణమని తెలిపింది. '2025-26 మదింపు సంవత్సరానికిగాను నోటిఫై చేసిన ఐటీఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా టెక్నాలజీని అప్‌డేట్ చేయడానికి సమయం పట్టింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి అవాంతరాలు లేకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం ఈ గడువును పెంచినట్టు ఐటీ శాఖ తన ఎక్స్‌లో పేర్కొంది.

రూ.50 లక్షల లోపు ఆదాయం..

రూ.50 లక్షల లోపు ఆదాయం కలిగిన వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్‌లు ఫామ్-1, 4తో ఐటీ రిటర్నులు దాఖలు చేయాల్సివుంటుంది. ప్రస్తుతం ఈక్విటీల నుంచి రూ.1.25 లక్షల వరకు దీర్ఘకాలిక మూలధన లాభాలు పొందిన సంస్థలు అటువంటి ఆదాయాన్ని ఐటీఆర్ 1, 4 ఫామ్‌లో చూపించుకోవచ్చును. గతంలో వీరు ఐటీఆర్-2ను దాఖలు చేయాల్సివుండేది. దీంతోపాటు 80సీ, 80జీజీ, ఇతర సెక్షన్ల కింద డిడక్షన్ క్లెయింకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. సాధారణంగా, ఐటీఆర్ ఫామ్‌లను ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా నోటిఫై చేస్తుండగా, ఈసారి మాత్రం నూతన ఆదాయ పన్ను చట్టం ప్రవేశపెట్టడంతో ఆలస్యమైందని, దీంతో ఐటీ ఫామ్‌లలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయని సీబీడీటీ వర్గాలు పేర్కొన్నాయి.

భారీగా తగ్గిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 27: గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98,500గా నమోదైంది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98 వేలుగా నమోదైంది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా భారీగా దిగొచ్చాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,370 తగ్గి రూ.99 వేలుగా నమోదైంది. ఔన్స్ గోల్డ్ ధర 45 డాలర్లు కరిగిపోయి 3,296.92 డాలర్లుగా నమోదైంది.

ఎన్ఎండీసీ ఆశాజనకం

న్యూఢిల్లీ, మే 27: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు నమోదు చేసుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,482 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఇనుప ఖనిజం, పెల్లెట్లు అత్యధికంగా అమ్మకాలు నమోదు చేసుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9 శాతం ఎగబాకి రూ.7,497.17 కోట్లకు చేరుకున్నది. వీటిలో ఇనుప ఖనిజం అమ్మకంతో రూ.6,350.49 కోట్ల నిధులు సమకూరగా, ఇతర మినరల్స్ విక్రయించడంతో రూ.662 కోట్ల నిధులు సమకూరాయి. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

కుప్పకూలాయి..

82 వేల దిగువకు సెన్సెక్స్ • 25 వేల కిందకు నిఫ్టీ

ముంబై, మే 27: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఐటీ, వాహన రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో వరుసగా రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 624.82 పాయింట్లు కోల్పోయి 81,551.63 వద్ద స్థిరపడింది. 30 సూచీల్లో 25 షేర్లు నష్టపోగా, కేవలం ఐదు సూచీలు లాభపడ్డాయి. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 174.95 పాయింట్లు కోల్పోయి 24,826.20 వద్ద స్థిరపడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి నెట్టాయి. దీంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా కోల్పోయి, చివర్లో భారీ నష్టాలను తగ్గించుకోగలిగాయి. పారిశ్రామి, తయారీ రంగ గణాంకాల విడుదలకుముందు మదుపరులు ముందస్తుగా అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల నష్టాలకు ప్రధాన కారణమని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. బుధవారం పారిశ్రామిక, తయారీ రంగ గణాంకాలతోపాటు ఈ వారం చివర్లో దేశ జీడీపీ గణాంకాలు కూడా విడుదలకానున్నాయి. సూచీల్లో అల్ట్రాటెక్ సిమెంట్ గరిష్ఠంగా 2.21 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ 2 శాతం, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోయాయి. కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్‌లు మాత్రం కోలుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలో కదలాడాయని, ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటం సూచీల పతనానికి కారణమైందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఎఫ్ఎంసీజీ, ఐటీ, వాహన, బ్యాంకింగ్, యుటిలిటీ, మెటల్ రంగ షేర్లు పతనం చెందాయి.

బీఎస్ఎన్ఎల్ లాభం 280 కోట్లు

న్యూఢిల్లీ, మే 27: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరోసారి లాభాల్లోకి వచ్చింది. వరుసగా రెండోసారి మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.280 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.849 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. 18 ఏండ్ల తర్వాత వరుస త్రైమాసికాల్లో లాభాలను ప్రకటించడం ఇదే తొలిసారని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్యా సింధియా తెలిపారు. 2007 తర్వాత వరుస త్రైమాసికల్లో లాభాలను నమోదు చేసుకోవడం విశేషమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ సంస్థ రూ.262 కోట్ల లాభాన్ని గడించిన విషయం తెలిసిందే. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం వల్లనే లాభాల్లోకి రాగలిగామని బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఏ రాబర్ట్ జే రవి తెలిపారు.

ఎల్ఐసీ లాభం 19,013 కోట్లు

క్యూ4లో 38 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, మే 27: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.19,013 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.13,763 కోట్లతో పోలిస్తే 38 శాతం వృద్ధిని కనబరిచినట్టు పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,50,923 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు తగ్గింది. దీంట్లో తొలి-ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.13,810 కోట్ల నుంచి రూ.11,069 కోట్లకు తగ్గినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే రెన్యూవబుల్ ప్రీమియం వసూళ్లు రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు పెరిగాయి. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.8,84,148 కోట్ల ఆదాయంపై రూ.48,151 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు..ప్రతి షేరుకు రూ.12 తుది డివిడెండ్‌ను అందిస్తున్నట్టు ప్రకటించింది. అలాగే పాలసీహోల్డర్లకు రూ.56,190 కోట్ల బోనస్ చెల్లింపులు జరపనున్నట్టు పేర్కొంది.

ఈ సందర్భంగా ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మెహంతీ మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సవాళ్లు ఉన్నప్పటికీ వృద్ధిని నమోదు చేసుకున్నట్టు, తొలి ఆరు నెలల్లో ఆశాజనక పనితీరు కనబరిచినట్టు చెప్పారు. పలు ఉత్పత్తులను మళ్లీ విడుదల చేయడం కలిసొచ్చిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలోకి అడుగుపెట్టడంలో భాగంగా వాటా కొనుగోలుపై ఆయన స్పందిస్తూ..ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉన్నదని, వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో బోర్డు నిర్ణయం తీసుకుంటుందన్నారు.

విదేశీ పెట్టుబడులు డౌన్

జనవరి-మార్చి మధ్యకాలంలో 24 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, మే 27: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో కేంద్రం పూర్తిగా విఫలమవుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 24.5 శాతం తగ్గి 9.34 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో భారత్‌లోకి 12.38 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. అంతర్జాతీయ దేశాల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో దేశీయంగా పెట్టుబడులు పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు వెనుకంజవేస్తున్నారు. కానీ, 2024-25 ఆర్థిక సంవత్సం మొత్తానికి ఎఫ్‌డీఐలు 13 శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సింగపూర్ నుంచి అత్యధికంగా 14.94 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, మారిషస్ నుంచి 3.73 బిలియన్ డాలర్లు, అమెరికా నుంచి 5.45 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్స్ నుంచి 4.62 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి 3.12 బిలియన్ డాలర్లు, జపాన్ నుంచి 2.47 బిలియన్ డాలర్లు, బ్రిటన్ నుంచి 795 మిలియన్ డాలర్లు, జర్మనీ నుంచి 469 మిలియన్ డాలర్ల మేర ఎఫ్‌డీఐలు వచ్చాయి. మొత్తం ఎఫ్‌డీఐల్లో సింగపూర్ వాటా 30 శాతంగా ఉండగా, మారిషస్ వాటా 17 శాతం, అమెరికా వాటా 11 శాతంగా ఉన్నది. ట్రేడింగ్, టెలికాం, ఆటో, నాన్-కన్వెన్షనల్ ఎనర్జీ, కెమికల్స్ రంగాల్లోకి పెట్టుబడులు వచ్చాయి.

గూడు కాపాడండి

- రియాల్టర్ల బారి నుంచి భూస్వామ్యం రక్షించాలని గ్రామస్తుల ఆందోళన

ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్ టౌన్, మే 27: రియాల్టర్ల నుంచి తమ నివాస భూమిని రక్షించాలని కో రుతూ మంగళవారం ఇప్పల్‌నవేగాం గ్రామస్తులు ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పూర్వీకుల కాలం నుంచి ఆ భూమిలో నివసిస్తున్నామని కొద్ది రోజులుగా కొందరు వ్యక్తులు తమకు సం బంధం ఉన్న భూమి అని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ గత వారం గ్రామస్తుల తరపున స్థానిక ఆర్డీవో లోకేశ్వర్ రావుకు వినతి పత్రం అందజేశామని, అయినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అమాయక ప్రజల ఇళ్ల నుంచి బయటకు తొలగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధ్యులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్య క్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట సీఐగా రమణమూర్తి

లక్షెట్టిపేట, మే 27 : లక్షెట్టిపేట సీఐగా రమణమూర్తి బదిలీపై రానున్నారు. ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన అల్లం నరేందర్.. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడి కార్యాలయం నుంచి రమణమూర్తిని లక్షెట్టిపేటకు బదిలీ చేసినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి (మల్టీ జోన్ -1) సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ నరేందర్‌కు పోలీస్ సిబ్బంది మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పోచయ్య

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పోచయ్యను నియమిస్తూ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన రోహిత్ దేశ్ పాండే ఇటీవల మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పోచయ్యకు తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తహసీల్దార్‌గా కొనసాగాలని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

హాజీపూర్, మే 27 : హాజీపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో చేసిన 270 రకాల పనులు తనిఖీ చేసేందుకు సామాజిక తనిఖీ బృందం బుధవారం నుంచి మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. వారికి ఆయా గ్రామాల టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు సహకరించాలని సూచించారు.

ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేయాలి

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : ప్రజా సంక్షేమం కోసం అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కేబినెట్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్, అధికారులతో ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కలెక్టర్లు అధికారుల సమన్వయంతో జిల్లాలోని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పనుల పురోగతి పరిశీలించాలని, జూన్ 1వ తేదీ నాటికి పూర్తి నివేదిక అందించాలని, 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసి అందించాలని తెలిపారు. ప్రస్తుతం కొవిడ్ వ్యాపిస్తున్న దృష్ట్యా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు వైరస్ నియంత్రించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో గల వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, భూ భారతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లక్ష్యాలను సమన్వయంతో పూర్తి స్థాయిలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

పోడు రైతులకు రుణాలు ఇవ్వాలి

బ్యాంక్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు, నాయకులు

కోటపల్లి, మే 27 : పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు బ్యాంక్ అధికారులు పంట రుణాలు అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిర్సా బ్రాంచ్ ఎదుట పోడు భూముల పట్టాదారులతో మంగళవారం ఆందోళన చేపట్టారు. రెండేళ్లుగా ఆదివాసులు పంట రుణాల కోసం బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నా రుణాలు ఇవ్వడం లేదన్నారు. పోడు భూములకు పంట రుణాలు ఇవ్వాలని గతంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో హామీ ఇచ్చినా సాధ్యంకావడంలేదని ఆందోళన చెందారు. బ్యాంక్ అధికారులు ఖాతాలను లాక్ చేస్తూ గిరిజలు, ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడె సుమలత, నాయకులు ఆత్రం శ్రావణ్, నాయకులు తలండి ముత్తయ్య, చిన్నన్న పాల్గొన్నారు.

ఎరువులు మోతాదులో వాడాలి

సారంగపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి కో ఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ

మందమర్రిరూరల్, మే 27 : రైతులు తమ పంటలకు మోతాదులోనే యూరియా, అలాగే పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు, పేడ వంటి ఎరువులు వినియోగించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మందమర్రి మండలం సారంగపల్లి గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, బహుళార్థక సాధక చెట్లను పెంచుకొని వాతావరణ కాలుష్యాన్ని, నెల కోతను తగ్గించుకోవాలని వివరించారు. చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు వరి, పత్తి కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలని తెలిపారు. శాస్త్రవేత్తలు ప్రియ సుగంధి, తిరుపతి, మాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, మండల వ్యవసాయధికారి కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆకలికేక మహాసభ విజయవంతం

మంచిర్యాల అర్బన్, మే 27 : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మంగళవారం నిర్వహించిన చలో హైదరాబాద్ ఆటో డ్రైవర్లు, కార్మికుల ఆకలికేక మహాసభ విజయవంతమైనట్లు రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. ఆటో జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు కలుపుకొని ఆటో కార్మికుల ఆకలి కేక యాత్ర నిర్వహించినట్లు చెప్పారు. యాత్ర ముగింపు సందర్భంగా ఈ మహాసభను రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, కార్మికులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆటో కార్మికుల కోసం ఆలోచించి ప్రతినెలా రూ.12 వేలు, ప్రత్యేకంగా రూ.వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కార్మికులు సహజ మరణం చెందినా రూ.5 లక్షలు, ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నెరవేర్చకుంటే భవిష్యత్ ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా నాయకులు బెల్లంకొండ మురళీధర్, పొట్ట మధుకర్, చల్ల విక్రం, ఆటో డ్రైవరు, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్

మందమర్రిలో పాత్రికేయులు, ప్రజా సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

మునీర్ మరణం తీరని లోటు

మందమర్రి, మే 27 : సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుడు ఎండీ మునీర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని పలువురు సీనియర్ పాత్రికేయులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అన్నారు. మందమర్రి పట్టణంలో మంగళవారం మునీర్‌కు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. మార్కెట్ బస్టాండ్‌లో ప్రారంభమైన ర్యాలీ వీటీ అబ్రహం స్థూపం వరకు సాగింది. అక్కడ నివాళుర్పించి, అనంతరం మార్కెట్ మీదుగా సింగరేణి పాఠశాల వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకుడు, సీనియర్ పాత్రికేయుడు హెచ్ రవీందర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్, ఎండీ అబ్బాస్, కొంగల తిరుపతి రెడ్డి, బండారు సూరిబాబు, బోరిగం వెంకటేశ్, పంజాల ఈశ్వర్, భూపెల్లి కనకయ్య, బర్ల సదానందం, కొండల్ రావు, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, సీపెల్లి సాగర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీవీ రమణ, సీపీఎం నాయకులు వెంకటేశం, పాత్రికేయులు పాల్గొన్నారు.

భారీ వర్షం

నెన్నెల : కొట్టుకుపోయిన ఎర్రవాగు వంతెన తాత్కాలిక రోడ్డు

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : ఆసిఫాబాద్‌లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మార్కెట్ ఏరియా జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు డ్రైనేజీ పనులు చేపట్టకోవడంతో చిన్నపాటి వర్షానికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉప్పొంగిన ఎర్రవాగు

నెన్నెల, మే 27 : నెన్నెల మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లంబాడీతండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించింది. వాగు ప్రవహించడంతో ఎర్రవాగు వంతెన వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో లంబాడీతండా, కుర్మగూడెం, కోనంపేట, జంగల్‌పేట, ఖర్జీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి, మైలారం, చిత్తాపూర్, ఆవుడం, గంగారం గ్రామాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి.

రేషన్ డీలర్ల సమావేశం

వాంకిడి, మే 27 : వాంకిడి తహసీల్ కార్యాలయ్యంలో మండల రేషన్ డీలర్లతో తహసీల్దార్ రియాజ్ అలీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా ఆహార ధాన్యాల నిల్వ, రవాణాలో ఇబ్బందుల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30 వరకు ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులకు 3 నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయలన్నారు. ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

దండేపల్లి(జన్నారం), మే 27 : జన్నారం మండలంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న గోవధ కేంద్రాలను మూసివేయాలని కోరుతూ హిందువాహిని సంస్థ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. పొన్కల్, రాంనగర్, ఎన్టీఆర్‌నగర్ వద్ద, క వ్వాల్ గ్రామాల్లో అక్రమంగా గోవులను వధిస్తున్నారన్నారు. దానిని అరికట్టి హిందువుల మనోభావాలను కాపాడాలని కోరారు.